క్లుప్తంగా

రోడ్డు ఇలా.. నడిచేదెలా...!



అధ్వానంగా ఉన్న సతివాడ-నెమలాం రోడ్డు

తెర్లాం: పెద్ద పెద్ద గోతులు, బురదమయమైన రోడ్డుపై ప్రతీ రోజు పాఠశాలకు నడిచి వెళ్లేందుకు నానా ఇబ్బందులు పడుతున్నామని, ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని మండలంలోని సతివాడ గ్రామానికి చెందిన విద్యార్థులు కోరుతున్నారు. సతివాడ నుంచి నెమలాం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు ప్రతీరోజూ 30మంది విద్యార్థులు కాలినడకన వెళ్తుంటారు. వర్షాకాలం కావడంతో రోడ్డంతా పెద్దపెద్ద గోతులు, బురదతో నిండిపోయింది. కనీసం నడిచి వెళ్లడానికి కూడా ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సతివాడ నుంచి నెమలాం వెళ్లే రోడ్డును బాగు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

పత్ర ద్రావణంతో పంటలకు మేలు



ద్రావణం తయారీపై అవగాహన

వంగర: పత్ర ద్రావణంతో పంటలకు మేలు జరుగుతుందని ప్రకృతి వ్యవసాయం మరువాడ యూనిట్ మేనేజర్ ఆర్నిపల్లి సింహాద్రినాయుడు అన్నారు. మండల పరిధి కింజంగిలో పత్రద్రావణం తయారీపై రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. వేప, కాగు, జిల్లేడు, జామ, ఉమ్మెత్త, తూటికాడ, రావి, చింత, బొప్పాయి, ఆముదం ఆకులతో ద్రావణం తయారీ చేసి పిచికారీ చేసే విధానాన్ని రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పత్తా లేని అధికారులు



అధ్వానంగా రెగ్యులేటర్ తలుపులు

రేగిడి : సంకిలి వద్ద ఓపెన్‌హెడ్ చానల్(చిట్టిగెడ్డ) రెగ్యులేటర్ తలుపులు పరిస్థితి అధ్వానంగా మారింది. ఇక్కడ తలుపులు కొట్టుకుపోవడంతో ఆయకట్టు రైతులు ఇటీవల తాత్కాలికంగా వెదురుబుంగలతో అడ్డుకట్ట వేశారు. బుధవారం ఈ తాత్కాలిక అడ్డుకట్ట కూడా వరద నీటికి కొట్టుకుపోయింది. దీంతో చానల్‌లోకి సాగునీరు పూర్తిగా నిలిచిపోయింది. ఈ రెగ్యులేటర్ తలుపులు బాగు చేయాల్సిన అధికారులు పత్తా లేకుండా పోయారు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్యపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు ఆయకట్టు రైతులు వెల్లడించారు.

ఓడీఎఫ్ సర్వే పరిశీలన



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

బొబ్బిలి రూరల్: మండలంలోని పారాది గ్రామంలో జరుగుతున్న ఓడీఎఫ్ ప్లస్ సర్వేను ఎంపీడీఓ పి.రవికుమార్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ మూత్ర విసర్జన నేరమని, జరిమానా విధిస్తామన్నారు. గ్రామాల్లో ఇంకా ఇటువంటి పోకడలు ఉన్నాయని, తద్వారా ప్రజలు రోగాల బారిన పడుతున్నారని అన్నారు. ప్రతి ఇంట్లో మరుగుదొడ్లను నిర్మించుకోవాలని సూచించారు. తద్వారా పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వల్ల వ్యాధులకు దూరంగా ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ భాస్కరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రావణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఉన్నారు.

ముగిసిన చౌడీశ్వరీదేవి ఉత్సవాలు

రాజాం : స్థానిక మల్లిఖార్జున కాలనీలోని కల్యాణగౌరీ మల్లిఖార్జునస్వామి ఆలయ ప్రాంగణంలో వెలసిన చౌడీశ్వరీ దేవి ఆలయ 29వ వార్షికోత్సవాలు బుధవారంతో ముగిసాయి. నాలుగు రోజులు పాటు ఆలయ అర్చకులు హరవిల్లి హరినాధశర్మ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా ఈ ఉత్సవాలు నిర్వహించారు. ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పీఎంసీల స్థానంలో ఎస్‌ఎంసీలు

- నియోజకవర్గంలో 263 పాఠశాలలు
- నేడు ఎన్నికలు

నియోజకవర్గంలో పాఠశాలలు ఇలా...

మండలం	హైస్కూల్స్	యూపీ	ప్రైమరీ
రాజాం	8	14	36
రేగిడి	14	10	57
వంగర	9	9	31
సంతకవిటి	10	12	53



ఎస్‌ఎంసీ ఎన్నికకు సిద్ధమైన రాజాం ప్రభుత్వ ఉన్నత పాఠశాల

రాజాం సిటీ: పాఠశాలల పర్యవేక్షణకు పేరెంట్స్ మానిటరింగ్ కమిటీలను గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రభుత్వం మారిన తరువాత కూటమి ప్రభుత్వం వీటిని స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్‌ఎంసీ)లుగా పేరు మార్పు చేసి ఎన్నికలు నిర్వహణకు సిద్ధమైంది. గత నెల 31న సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ మేరకు అన్ని పాఠశాలల్లో ఈ నెల 8న ఎన్నిక నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన పీఎంసీల కాల పరిమితి ముగియడంతో వాటి స్థానంలో పాఠశాల యాజమాన్య కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే నియోజకవర్గంలోని 263 పాఠశాలల్లో ఎన్నికల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఎస్‌ఎంసీ కమిటీ సభ్యుల ఎంపిక ఇలా..

ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం గురువారం అన్ని పాఠశాలల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 1.30 గంటలకు చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎంపిక చేయాలి. రెండు గంటలకు ఎంపికైన కమిటీతో ప్రమాణ స్వీకారం చేయించాలి. అనంతరం 3 గంటల నుంచి 3.30గంటల వరకు మొదటి ఎస్‌ఎంసీ సమావేశాన్ని నిర్వహించాల్సి ఉంటుంది. ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి కమిటీలు ఏర్పాటు చేయాలి. ఒక్కో తరగతి నుంచి ముగ్గురు వంతున ప్రాథమిక పాఠశాలల్లో ఏడో తరగతి వరకు ఉంటే 21, ఎనిమిదో తరగతి వరకు ఉంటే 24, ఉన్నత పాఠశాలల్లో 6, 7, 8 తరగతులకు ముగ్గురు వంతున తొమ్మిది మందితో కమిటీలు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.

బొబ్బిలిలో...

బొబ్బిలిరూరల్: మండలంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల ఎస్‌ఎంసీల చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలను గురువారం నిర్వహించేందుకు విద్యాశాఖాధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. దాదాపు 91 పాఠశాలలుండగా ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య సుమారు 7వేల 120 మంది ఉన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ ఎన్నికల్లో పాల్గొని చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకోనున్నారు. మండలంలోని అలజంగి, కారాడ, పారాది, నారశింహునిపేట, మెట్టవలస, కలవరాయి, కోమటిపల్లి, పిరిడి, జగన్నాధపురం తదితర గ్రామాల్లో వివాదాలు జరిగే అవకాశం ఉందని అధికారులు గుర్తించారు. ఈనేపథ్యంలో పోలీసుల సహకారంతో ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరిగేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

రామభద్రపురంలో..

రామభద్రపురం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం విద్యాకమిటీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంఈఓలు తిరుమలప్రసాద్, పెంటయ్య తెలిపారు. మండలంలో 57 పాఠశాలలు ఉండగా వాటిలో 12 పాఠశాలలు సమస్యాత్మక పాఠశాలలుగా గుర్తించామని, అక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

తెర్లాంలో...

తెర్లాం: మండలంలోని 67 ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలు గురువారం నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ త్రినాధరావు బుధవారం చెప్పారు. మండలంలో గురువారం ఉదయం 7గంటల నుంచి ఎస్‌ఎంసీ ఎన్నికలు ప్రారంభమవుతాయని, ఇప్పటికే ఎన్నికల ప్రక్రియపై పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అన్ని సూచనలు, సలహాలు అందించడం జరిగిందన్నారు. ఎస్‌ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు తమవంతు సహకారం అందించాలని ఎంఈఓ కోరారు.

నిబంధనలు ఇలా...

- ప్రభుత్వ, ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో తప్పనిసరిగా ఎస్‌ఎంసీలు ఏర్పాటు చేయాలి.
- పాఠశాల ప్రధానోపాధ్యాయులు కమిటీలను ఏర్పాటు చేయాలి.
- కమిటీ ఏర్పాటుకు 50 శాతం పేరెంట్స్/గార్డియన్స్ హాజరు కావాలి.
- కోరం ఏర్పడడానికి సమయాన్ని పాఠశాల హెచ్‌ఎం నిర్ణయించవచ్చు.
- చేతులెత్తే విధానం, నోటిమాటతో చెప్పడం ద్వారా ఎస్‌ఎంసీ సభ్యులు, చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక జరుగుతుంది. -- ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రం రహస్య ఓటింగ్ విధానాన్ని అనుసరించవచ్చు.
- ఎస్‌ఎంసీకి ఎన్నికైన సభ్యుల నుంచి చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నిక ఉంటుంది. వీరిలో ఒకరు వెనుకబడిన తరగతుల నుంచి ఉండాలి. వారిలో కనీసం ఒకరైనా మహిళ ఉండాలి.
- తహసీల్దార్, ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, వీఆర్‌ఏ పరిశీలకులుగా ఎన్నికల ప్రక్రియలో పాల్గొనవచ్చు.
- తల్లి, తండ్రి, సంరక్షకుడికి ఓటింగ్‌లో ప్రాధాన్యం ఇస్తారు. అయితే వీరిలో ఒకరికే ఓటు హక్కు ఉంటుంది.

ఏర్పాట్లు పూర్తి

ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వ పాఠశాలలకు సమాచారం అందించాం. షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు జరిపించాలని ఇప్పటికే అందరి హెచ్‌ఎంలకు తెలియజేశాం. ఎన్నిక విధానంపై అవగాహనా కార్యక్రమాలు కూడా నిర్వహించాం. ఏకగ్రీవం కాని పాఠశాలల్లో ఎక్కడా ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నాం.

– ఎంవీ ప్రసాదరావు, ఎంఈఓ, రేగిడి

బ్యాంకు లింకేజీ రుణాలు సక్రమంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ కల్యాణచక్రవర్తి

రాజాం : బ్యాంకుల నుంచి మహిళా సంఘాలకు ఇస్తున్న లింకేజీ రుణాలు సక్రమంగా ఉండేలా, వినియోగపడేలా బ్యాంకు అధికారులు, వెలుగు సిబ్బంది సమన్వయంతో పని చేయాలని డీఆర్‌డీఏ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి అన్నారు. రాజాం మండల పరిషత్ కార్యాలయంలో జాయింట్ మండల లెవెల్ బ్యాంకర్స్ కమిటీ మీటింగ్(జేఎమ్ఎల్‌బీసీ) బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ మహిళా సంఘాలు కట్టే పొదుపు ఖాతా నుంచి పొదుపులు విత్‌డ్రాలు చేసిన తరువాత మాత్రమే బ్యాంకు నుంచి లింకేజీ అప్పులు ఇప్పించాలని అన్నారు. అలా పొదుపు డబ్బులు విత్‌డ్రా చేయకుండా బ్యాంకు లింకేజీ అప్పు ఇప్పిస్తే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ యూనిట్‌ల లక్ష్యాన్ని చేరుకోవాలని, బ్యాంకర్స్ పరిశీలించి యూనిట్లు సకాలంలో మంజూరీ చేయాలని సూచించారు. నాబార్డు ఏజీఎం నాగార్జున మాట్లాడుతూ ఎఫ్‌పీఓ గ్రూపుల్లో ఉన్న మహిళా రైతులకు అప్పులు బ్యాంకర్స్ ఇవ్వాలని అన్నారు. మెప్మా పీడీ బి.సుధాకర్ మాట్లాడుతూ బ్యాంకుల్లో సీఎస్‌పీలు ద్వార జరుగుతున్న ఆర్థిక లావాదేవీలు సక్రమంగా లేవని, అలాంటి సీఎస్‌పీలపై చర్యలు తీసుకోవాలని బ్యాంకర్లకు సూచించారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం రమణమూర్తి, పశుసంవర్థకశాఖ ఏడీఏ బి.జయప్రకాష్, అగ్రికల్చర్ ఏడీఏ కె.చంద్రరావు, వెలుగు ఏసీ ఎ.చిరంజీవి, రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల ఏపీఎంలు ఎస్.అప్పలనాయుడు, బి.గోవిందరావు, ఎం.చక్రపాణి, టి.సీతారామ్‌లతో పాటు సీసీలు, పలు బ్యాంకుల బ్రాంచి మేనేజర్లు, ఫీల్డ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

రాయితీపై రైతులకు మైక్రో ఇరిగేషన్ పరికరాలు



మైక్రో ఇరిగేషన్ పైపుల వినియోగం పరిశీలిస్తున్న పీడీ లక్ష్మీనారాయణ, అధికారులు

రాజాం : మండలంలోని రైతులకు రాయితీపై మైక్రో ఇరిగేషన్ పరికరాలు అందిస్తున్నామని ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ పీడీ పి.లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలో బొద్దాం, గార్రాజుచీపురుపల్లి తదితర గ్రామాల్లో మైక్రోఇరిగేషన్ పరికరాల వినియోగాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ డ్రిప్, స్ప్రింక్లర్ ఇరిగేషన్ ద్వారా సాగునీటి ఆదా, భూగర్భ జలవనరుల పొదుపు, అధిక పంట దిగుబడి, విద్యుత్ వినియోగంలో పొదుపు జరుగుతుందని అన్నారు. డ్రిప్ ఇరిగేషన్ కావాలనుకునే రైతులు రైతు సేవా కేంద్రాల్లో తమ వివరాలు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. 50 నుంచి 90 శాతం రాయితీతో ఈ పరికరాలు అందిస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంఐ ఇంజినీర్ శ్రీనువాసరావు, బొద్దాం వీఏఏ శివశంకర్, ఎమ్ఐఏఓలు, రైతులు పాల్గొన్నారు.

నేడు నందిగాంలో గ్రామ సందర్శన

తెర్లాం: మండలంలోని నందిగాం గ్రామ పంచాయతీలో గ్రామ సందర్శన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బి.మధుసూదనరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల నోడల్ అధికారి, జిల్లా వ్యవసాయ అధికారి వి.టి.రామారావు హాజరవుతారని చెప్పారు. గ్రామ సందర్శన కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు, నందిగాం సచివాలయ ఉద్యోగులు హాజరు కావాలని ఆయన కోరారు.

తల్లి పాలతోనే సంపూర్ణ ఆరోగ్యం



రాజాం : సారధిలో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, ఆయాలు, ఆశా కార్యకర్తలు

రాజాం : తల్లిపాల వారోత్సవాల ర్యాలీని బుధవారం రాజాం మున్సిపాల్టీ పరిధిలోని సారధిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ సీహెచ్ సన్యాసమ్మ గర్భిణులకు, బాలింతలకు తల్లిపాల ఆవశ్యకత, బిడ్డల ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు, ఆయాలు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సంతకవిటిలో ర్యాలీలు

సంతకవిటి: మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. తల్లిపాలు విశిష్టతను తెలుపుతూ ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలు

రేగిడి : మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఈ కార్యక్రమాలను గ్రామాల్లోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, వైద్య సిబ్బంది నిర్వహించారు. బాలింతలకు తల్లిపాలు ప్రాముఖ్యతను వివరించారు.

కొట్టిశలో..

వంగర: మండల పరిధి కొట్టిశ గ్రామంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ఆవశ్యకతను అంగన్‌వాడీ కార్యకర్తలు వివరించారు. పౌష్టికాహారం తీసుకోవాలని సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



రేగిడి : లక్ష్మీపురంలో తల్లిపాల వారోత్సవాలు



వంగర: కొట్టిశలో తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలి

రామభద్రపురం: మండల కేంద్రం అంతర రాష్ట్ర కూడలి కావడంతో వాహనాల రద్దీ పెరగడంతో పాఠశాలల వద్ద విద్యార్థులు రోడ్డు దాటాలంటే భయపడుతున్నారు. పాఠశాలల వద్ద వేగ నియంత్రణ సూచికలు లేకపోవడంతో వాహన చోదకులు తగ్గేదేలే అంటూ అతి వేగంగా నడుపుతున్నారు. దాంతో విద్యార్థులు పాఠశాలలకు వచ్చినపుడు, పాఠశాల విడిచిపెట్టిన తర్వాత వెళ్లినప్పుడు రోడ్డు దాటేందుకు భయపడుతూ ఇద్దరు లేక ముగ్గురు జట్టుపట్టుకుని వెళ్తున్నారు. ఎప్పుడు ఏ వాహనం స్పీడుగా వస్తుందో తెలియని పరిస్థితి. దాంతో సంబంధిత అధికారులు స్థానిక ఉన్నత పాఠశాల వద్ద రహదారిపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

నేటి నుంచి సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ

సంతకవిటి: మండలంలోని 34 పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులకు గురువారం నుంచి 3 రోజులు స్ట్రీట్ లైటింగ్, శానిటేషన్, సాలిడ్ వేస్ట్ మేనేజిమెంట్‌లపై శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.పైడితల్లి బుధవారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. పంచాయతీల సంర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు హాజరు కావాలని కోరారు.

రేగిడిలో..

రేగిడి : స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం నుంచి మూడు రోజుల పాటు పంచాయతీల అభివృద్ధిపై శిక్షణ ఉంటుందని ఎంపీడీఓ శ్యామలాకుమారి బుధవారం తెలిపారు. పంచాయతీ కార్యదర్శులతో కలిపి ఈ శిక్షణ ఇస్తున్నామని, ఉదయం 10 గంటలు నుంచి సాయంత్రం 5 గంటలు వరకూ శిక్షణ జరుగుతుందని తెలిపారు.

రాజాం గ్రామదేవత పండగ తేదీలు ఖరారు

రాజాం సిటీ: రెండేళ్లకొకసారి నిర్వహించే రాజాం - సారధి గ్రామదేవత పండగ తేదీలను కమిటీ సభ్యులు నిర్ణయించారు. ఈ మేరకు రాజాం-సారధి గ్రామదేవత కమిటీ పెద్దసేనాపతి దాసరి పోలీసు బుధవారం అమ్మవారి పండగలకు సంబంధించి తేదీలు వెల్లడించారు. సెప్టెంబర్ 14న మొదటి చాటింపు వేయగా 15న భక్తులు ఉపారాలు తీయనున్నారని తెలిపారు. 16న రెండో చాటింపు, 17న ఉపారాలు తీస్తారని తెలిపారు. ఘటోత్సవం సెప్టెంబర్ 22 నుంచి అక్టోబర్ 15 వరకు రాజాంలోని అన్ని వీధుల్లో అంగరంగ వైభవంగా జరగనుందని పేర్కొన్నారు. మొదటి ఘటం సెప్టెంబర్ 22న, రెండోది 24న, మూడవది 29న, నాలుగవది అక్టోబర్ 1న, ఐదవది 6న, ఆరవది 8న ఘటాల ఊరేగింపు జరగగా ఇవన్నీ ఆది, మంగళవారాల్లోనే చేపట్టనున్నామని తెలిపారు. ఏడవది అక్టోబర్ 10న గురువారం బంగారమ్మ తల్లి అనుపు ఘటం, ఎనిమిదవ ఘటం 13న దుర్గమ్మతల్లి అనుపుఘటం, చివరిది 15న బురదల పోలమ్మ అనుపుఘటంతో పండగలు పూర్తికానున్నాయని తెలిపారు.

వాహన తనిఖీలు

బొబ్బిలి: పట్టణంలోని పాత బొబ్బిలి జంక్షన్‌లో ఎస్ఐ జి.లోవరాజు తన సిబ్బందితో వాహన తనిఖీలు బుధవారం చేపట్టారు. ఆర్టీసీ బస్సులు, వ్యాన్‌లు, కార్లను నిలిపి క్షుణ్ణంగా తనిఖీలు చేసి ప్రజలకు సూచనలు చేశారు. డ్రగ్స్, గంజాయి, సారా తదితర మత్తుపదార్థాలను తరలించకుండా చర్యలు తీసుకుంటున్నామని, ఎవరైనా తరలిస్తే కఠిన శిక్షలు ఎదుర్కొనాల్సి వస్తుందని హెచ్చరించారు. ఏఎస్ఐ జి.భాస్కరరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

సంతకవిటి: మండలంలోని మండాకురిటి గ్రామానికి అమ్మమ్మ ఇంటికి వచ్చిన తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి తాడితోట ప్రాంతానికి చెందిన 15 సంవత్సరాల యువతి అదృశ్యం అయినట్లు బుధవారం తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ షేక్ శంకర్ తెలిపారు. వివరాల్లోకి వెళితే రాజమండ్రి నుంచి ఈ నెల 5వ తేదీన మండాకురిటి అమ్మమ్మ ఇంటికి తల్లిదండ్రులతో వచ్చిన యువతి మంగళవారం ఉదయం టిఫిన్ నిమిత్తం బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. స్నేహితులు, బంధువుల ఇంటి వద్ద వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో తండ్రి ఫిర్యాదు చేశారని, కేసు నమోదు చేశామని తెలిపారు.

ఆర్టీసీ కొరియర్ సర్వీసులను వినియోగించుకోవాలి



తెర్లాంలో కొరియర్ సర్వీసులను ప్రారంభిస్తున్న మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ సత్యనారాయణరాజు

- మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ సత్యనారాయణరాజు

తెర్లాం: ఏపీఎస్ ఆర్టీసీ విజయనగరం వారి ఆధ్వర్యంలో తెర్లాంలో ఏర్పాటు చేసిన కొరియర్, పార్శిల్ సర్వీసులను వినియోగదారులంతా సక్రమంగా వినియోగించుకోవాలని ఆ సంస్థ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ డి.ఎస్.సత్యనారాయణరాజు అన్నారు. స్థానిక గేట్వే ఆన్‌లైన్ సెంటర్‌లో ఆర్టీసీ కొరియర్, పార్శిల్ రవాణా కార్యాలయాన్ని బుధవారం కాకినాడ ఇమ్మానుయేల్ బైబిల్ కాలేజ్ వ్యవస్థాపకులు, కూనాయవలస క్రీస్తు ప్రార్థనా మందిరం సీనియర్ పాస్టర్ రెవ. సంపత్‌కుమార్ భాష్యం చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమానికి హాజరైన ఏపీఎస్ ఆర్టీసీ విజయనగరం మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో ఏపీఎస్‌ఆర్టీసీ కొరియర్, పార్శిల్ సర్వీసులను ఇప్పటికే ప్రారంభించామన్నారు. తెర్లాంలో బుధవారం నుంచి ఆర్టీసీ కొరియర్, పార్శిల్ సర్వీసును అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ కొరియర్, పార్శిల్ సర్వీసు ఏజెంట్ వెలగాడ రమేష్, పాస్టర్లు ప్రతాప్, ఎఫ్రాయిము, తెర్లాం ఎంపీటీసీ జి.ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన సైకిల్ యాత్రికుడు



సంకిలి ఉన్నత పాఠశాలలో సైకిల్ యాత్రికుడుకు స్వాగతం పలుకుతున్న విద్యార్థులు

రేగిడి : మండలంలోని సంకిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పశ్చిమబెంగాల్‌కు చెందిన సైకిల్ యాత్రికుడు సుప్రియదాస్ బుధవారం సందర్శించారు. పాఠశాలలోని విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు పర్యావరణ పరిరక్షణ, చెట్లు నాటడం, సంరక్షించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జూలై 12న పశ్చిమబెంగాల్‌లోని తన స్వగ్రామం నుంచి భారత దేశ సైకిల్ యాత్రకు బయలుదేరినట్లు వెల్లడించారు. కన్యాకుమారి వరకూ తన యాత్ర సాగుతుందని అన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలు తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తూ ఈ యాత్ర నిర్వహిస్తున్నానని, పలుచోట్ల ప్రజలకు, విద్యార్థులకు, యువతకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. పాఠశాల హెచ్‌ఎం మరడాన రామినాయుడు, ఉపాధ్యాయులు కృష్ణమోహన్, గోవిందరావు, ఎమ్ఐఎస్ఎమ్ కోఆర్డినేటర్ కెంబూరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆనకట్టలో పెరిగిన నీరు



కుడి ప్రధాన కాలువలో సమృద్ధిగా ప్రవహిస్తున్న సాగునీరు

సంతకవిటి: రెండు రోజులుగా వర్షం పడడంతో మండలంలోని రంగారాయ పురం వద్ద ఉన్న నారాయణపురం ఆనకట్టలోకి ఎగువ నుంచి నీరు వచ్చి చేరింది. దీంతో ఆనకట్టలో నీరు స్వల్పంగా పెరిగింది. కుడి ప్రధాన కాలువ గుండా సాగు నీరు సమృద్ధిగా ప్రవహిస్తుంది.

హెచ్‌టీ వైర్లు మార్చాలి..

- హెచ్‌టీ వైర్లు మా గ్రామం మీదుగా వేయొద్దు

బొబ్బిలిరూరల్: మండలంలోని పారాది బ్రిడ్జి నిర్మాణానికి అవసరమయిన విద్యుత్ లైన్ల మార్పిడి చేసే సమయంలో తమ ఇళ్ల మీదుగా వైర్లు వెళ్తున్నాయని లైన్ మార్చాలని పారాది గ్రామస్తులు తహసీల్దార్ ఎం శ్రీను, ఈపీడీసీఎల్ డీఈఈ ఎం శ్రీనివాసరావులకు విన్నవించుకున్నారు. బుధవారం పారాది బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా లైన్ మార్చాల్సి ఉన్న కారణంగా వీరు అడ్డుకోవడంతో అధికారుల బృందం గ్రామానికి వెళ్లి గ్రామస్తులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. గతంలో దరఖాస్తు చేస్తే బాగుండేదని, ఇప్పుడు అలైన్‌మెంట్ అయ్యాక మార్చడం ఇబ్బంది అవుతుందని చెప్పగా సర్పంచ్ నానేశ్వరి, న్యాయవాది నగేష్, ధనుంజయరావు పక్కనే స్థలం ఉన్నందున ప్రజాప్రయోజనాల దృష్ట్యా మార్చాలని విన్నవించుకున్నారు. వీలును బట్టి చర్యలు తీసుకుంటామని అధికారులు వారికి చెప్పారు. ఆర్అండ్‌బీ ఏఈ బీఏకే రాజు, ఆర్ఐ కల్యాణచక్రవర్తి తదితరులున్నారు.